


సెలవుల్లో నేను యింటికి వచ్చినట్టు కబురు చేశాక ఒకరోజు ఎలాగో తీరిక చేసుకుని నన్ను చూసిపోవటానికి వచ్చాడు శేషుమామయ్య. వెంట సినిమా పత్రికలూ, ఘాటు ప్రేమ కథలూ, డిటెక్టివ్ నవలలూ తెచ్చుకున్నాడు. ఆరోజు-ఆయన మా ఇంట్లో గడిపే కొన్ని గంటల వ్యవధిలోనూ చదువుకోవటానికి ఆ పుస్తకాలన్నీను.

అవి చూచి నే నేం ఆశ్చర్యపడ లేదు, యిటీవల కొన్ని సంవత్సరాలుగా ఆయనలో వస్తున్న మార్పుని గమనిస్తున్నవా ణ్నవటంచేత.

ఆయన మా యింట్లో వుండేది ఆ సాయంత్రంవరకే. ముక్కోటి దేవతలు దిగివచ్చి నిర్బంధం చేసినా రాత్రికి వుండడు. అంచేత, దిద్దవలసిన యూనివర్సిటీ పేపర్లన్నీ ఒక పక్కకి నెట్టి

ఆయనతో కబుర్లలోకి దిగాను. మా యింట్లో మిగతావాళ్ళందరికన్నా నాతో ఎక్కువ చనువుగా వుంటాడు మామయ్య.

"నడిచే వచ్చావా?" అన్నాను.

"ఆఁ."

"షష్టిపూర్తి దాటినా చేవ తగ్గ లేదు మనిషికి," అన్నాను.

మామయ్య నవ్వాడు.

శేషుమామయ్య వుండేవూరు మా వూరికి నాలుగు మైళ్ళ దూరంలో వుంది. బస్సుల్లో వస్తే పావుగంట ప్రయాణం. కాని శేషుమామయ్య ఎప్పుడూ పొలాల్లోంచి అడ్డదారిని నడిచే వస్తుంటాడు. పూర్వపురోజుల్లో నయితే అలా వచ్చినప్పుడల్లా దారిలో తోటల్లోని మల్లెపూలూ, చేమంతులూ కోసుకువచ్చేవాడు, ఇంట్లో ఆడవాళ్లు తల్లో పెట్టుకుంటారని. ఇప్పుడదేమీ లేదు. పునుగు జవ్వాదులు మిలాయించి తీర్చిన సన్నని నామం పెళపెళ లాడుతూండగా, సిల్కు కండువా మడతలు రెపరెప లాడుతూండగా దొరలాగ నడిచివస్తాడు. అప్పటికీ ఒక్కొక్కసారి చెల్లాయి అడగనే అడుగతుంది వుండబట్టలేక.

"అలా చేతులు తిప్పుకుంటూ రాక పోతే తోటల్లోవి కాసిన పూలైనా కోసుకురావచ్చుగదా!" అని.

"వాళ్ళంతా కష్టపడి, తోటలు పెంచుతున్నది నీకు పూలు సప్లయి చేసేందుకే పాపం..."

"నాకు కాకపోతే మరో నాగరత్నమ్మకైనా మరిచిపోకుండా సప్లయి చేస్తారుగా?" అంటుంది చెల్లాయి. శేషుమామయ్య తిరిగి వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా పూలు కోసుకెళ్ళటాన్ని గుర్తు చేస్తూ.

"నీకు పొగరెక్కువ..." అంటాడు మామయ్య.


శేషుమామయ్యతో మాకు చెప్పుకోదగ్గ బంధుత్వ మేమీ లేకపోయినా, దాన్ని మించిన ఆత్మీయత వుంది. మేము తప్ప ఆయనకు నా అన్నవాళ్ళవరూ లేరు. ఆయన ఎప్పుడో తన చిన్నతనంలో వచ్చి ఆ వూళ్ళో చేరాడు. చేరినప్పట్నుంచీ నలుగుర్నీ మంచి చేసుకుని అక్కడే స్థిరపడ్డాడు. ఊరి చివర వున్న ఓ పాడుబడ్డ విష్ణ్వాలయాన్ని బాగు చేయించి, వూళ్ళో చందాలు వసూలు చేసి, ఆ డబ్బుతో తిరిగి విగ్రహప్రతిష్ట చేయించి, ఆరోజు నుంచీ నిత్యదీపారాధన ప్రారంభించాడు. అది చూచి వూళ్ళోవాళ్ళు కూడా భక్తిప్రపత్తులు కలిగినవారై తరచుగా అంతో యింతో దేవుడి కైంకర్యానికి సమర్పించుకుంటూ వచ్చారు. రోజులు గడిచేకొద్దీ వాళ్ళ ఆదరణతో మామయ్య ఆ వూళ్ళో ఓ చిన్న కుటీరం, భూమీ పుట్రా పర్పరచు

కున్నాడు. ఎలాంటి సంసార బంధములూ లేకుండా పూర్తిగా భగవంతుడి మీదే దృష్టి కేంద్రీకరించాలన్న దృఢ సంకల్పాన్ని అందరికీ వెల్లడించాడు.

అందుకే మామయ్య పెళ్ళి చేసుకోలేదు. ఆ వూరికివచ్చి చేరిన కొత్తల్లోనే, అంటే దాదాపు నలభై యేళ్ళ కిందట, మామయ్య మా నాన్నతో పరిచయం చేసుకుని ఆయనవద్ద కొంచెం వేదమూ, సంస్కృతమూ, పంచ కావ్యాలూ నేర్చుకున్నాడు. ఆయనకూ నాన్నకూ వయసులో ఎక్కువ తేడా లేదు; నాన్న ఆయనకన్నా ఒకటి రెండేళ్ళు పెద్దవాడు. అప్పట్లో తరచుగా మా యింటికి రాకపోకలు జరుపుతూండడంతో మామయ్యకు మా కుటుంబంతో ఎక్కువ సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ తర్వాతనే మా అన్నదమ్ములూ, అక్క చెల్లెళ్ళూ అందరం పుట్టామట. మేము పెరిగి జ్ఞానం తెచ్చుకునేనాటికే మామయ్య మా కుటుంబంలో ఒకడై పోయాడు. ఆయనను మొట్టమొదట మాలో ఎవరు 'మామయ్యా' అని పిలిచారో గాని, ఆయనతో మాకు అదే వరస సరిపడి పోయింది. తమాషా ఏమిటంటే, ఆయన మాకు మాత్రమే కాదు, మా యింటి అల్లుళ్ళకూ, కోడళ్ళకూ, వాళ్ళ పిల్లలకూ, మిగతా వచ్చిపోయే బంధువులకూ అందరికీ మామయ్యే.

తనకన్నా కొంచెం పెద్దవాడవటం వల్లా, ఆయనవద్ద తను అంతో యింతో చదువుకుని వుండటంవల్లా, మా నాన్నపట్ల మాత్రం మామయ్యకు కాస్త భయం, గౌరవం వున్నాయి. మిగతా ఎవరంటేనూ ఆనూయనకు లక్ష్యంలేదు. అమ్మ ఆయనకన్నా వయసులో చిన్నట – అంచేత ఆమెను 'చెల్లమ్మా' అని పిలుస్తాడు. వచ్చినప్పుడల్లా ఆమెకు వంటలో సాయం చేస్తాడు; కూరలు తరుగుతాడు; పప్పు రుబ్బి పెడతాడు. ఇంటిల్లిపాదీ భోజనాలకు కూచున్నాక తను అందరికీ ఒక వరస వడ్డించి మరీ కూచుంటాడు. అమ్మకు వంటలో సాయం చెయ్యకుండా నవలలు చేతపట్టుక్కూచుంటుందని అక్కయ్యను కేకలేస్తాడు. మాలో ఎవరైనా ఏదైనా జవాబు చెప్పబోతే, "నా కళ్ళముందు పుట్టిన కుంకలు, మీరా నాకు చెప్పేది?" అంటూ దబాయిస్తాడు.

ఇప్పుడయితే కాలేజీ వుద్యోగంతో తీరిక దొరక్కుండా పోతోంది కానీ, నేను చిన్నప్పటినుంచీ కాలేజీ చదువు పూర్తి చేసేవరకూ ఎప్పుడూ శేషు మామయ్యను వెన్నంటి వుండేవాణ్ని. చీటికి మాటికీ ఏదో వంకతో వాళ్ళ వూరికి వెళ్ళేవాణ్ని. మామయ్య మంచి భోక్త. ఆవకాయీ, పేరిన నెయ్యీ, తోడు పెరుగూ లేకుండా




ముద్ద ఎత్తాడు. నేను వెళ్ళినప్పుడు మాత్రం, 'కుర్రకుంక' వట్టి ఆవకాయ భరాయించలేడని, ముద్దపప్పు వండేవాడు. ఇద్దరం కలిసి భోంచేశాక, కుటీరం పంచలో దర్భచాపమీద కూచుని నాకు కథలు చెప్పేవాడు. అవన్నీ గాఢశృంగారరసంతో నిండినవే.

ఇప్పుడాలోచిస్తే, ఆ రోజుల్లో మామయ్య యింట్లోవున్న ఆవకాయి, తోడు పెరుగు కోసం నేనెంత అవసరంగా వెళ్ళేవాడినో, నేను కూడా మామయ్యకు అంత అవసరంగా వుండేవాడి ననిపిస్తోంది. ఆయన చెప్పే కథలు వినటంద్వారా నేను ఆయనలో నిక్షిప్తమై, నిద్రాణమై అణగివున్న శృంగార భావవీచికల కొక మార్గం కల్పించాను. ఎందుకంటే ఆయన ఆ కథలు చెప్పేది నాకొక్కడికే. మిగతా యావన్మందికీ మహాభక్తవిజయంలోని కథలు చెప్పేవాడు. మనిషి కొంచెం సంగీతగాడు. పగలూ, రాత్రీ భోజనానంతరం రాగయుక్తంగా పురాణం చెప్పేవాడు. ఊళ్ళోని కొంతమంది ఆడవాళ్ళూ మగవాళ్ళూ వినటానికి వచ్చేవాళ్ళు. బయట నలుగురిలో వున్నప్పుడు అయన ఒక్క క్షణకాలం మౌనంగా వుండటం నేను చూడలేదు. జనాంతికంగా భగవద్గీత శ్లోకాలో, భాగవతం పద్యాలో వల్లించుతూ వుండేవాడు. ఎప్పుడేనా పండగో, పబ్బమో అయి, మా యింటికి వచ్చి, రెండుమూడు రోజులపాటు వుండవలసివచ్చినప్పుడు వెంట ఏ భాగవతమో, రంగనాథ రామాయణమో

తెచ్చుకుని రాత్రిళ్ళు గొంతెత్తి చదువుతుండేవాడు. ఈ విషయంలో ఒకసారి ఆయన అన్నయ్యతో ఘర్షణపడి అలిగి పోవటం నాకింకా గుర్తుంది. బి. ఏ. పరీక్షను పార్టులు పార్టులుగా విడగొట్టి సెప్టెంబరుకు తయారవుతున్న అన్నయ్య రాత్రి టీ తాగి తన గదిలో పుస్తకాలతో తల బద్దలుకొట్టుకుంటుంటే, పక్కనే వరండాలో మామయ్య కంచుకంఠంతో రుక్మిణీ కల్యాణం హోరెత్తిపోతోంది. (రుక్మిణీ కల్యాణంఅంటే మామయ్యకు ప్రత్యేకాభిమానం – శ్రీ కృష్ణుడిలా సాహసించగలవాడీనాటి ప్రేమికుల్లో ఒక్కడూ లేడని మామయ్య చాలా సార్లు నా ముందు నొచ్చుకున్నాడు) ఆ దగ్గర్లోనే పడుకున్న మా కెవ్వరికీ నిద్రలేదు. అర్ధరాత్రిదాకా చూసిన అన్నయ్య యిక భరించలేక గదిలోంచి బయటికి దూసుకొచ్చి బుసలుకొట్టాడు: "అర్ధరాత్రి వేళ నీ అంకమ్మ శివాలేమిటి?" అంటూ.

మామయ్య తను మామూలుగా మా అందరినీ కేకలేసే ధోరణిలో అన్నయ్యను నోరు మూసుకోమని అన్నాడు గాని, అన్నయ్య మూసుకోలేదు. "నా కిప్పుడు కావలసింది రుక్మిణీ కల్యాణం కాదు, గజేంద్ర మోక్షం," అని ఆక్రోశించాడు, పరీక్షలనే మొసలి నోట్లో చిక్కుకున్న గజేంద్రుడిలా అన్నయ్య.

అప్పటికి అన్నయ్యది నిజమైన కోపమేనని గుర్తించిన మామయ్య, పురాణ ధోరణిలోనే అన్నయ్యకు జవాబిచ్చాడు: "కాలేజీలో గీసురు బాసురుమని నాలు గింగ్లీషుముక్కలు చదువుకునే కుర్రకుంకవి నీకు భాగవతం మజా ఏం తెలుస్తుంది? కల్యాణాత్మకమైన విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తవై కల్యుంఁడెవ్వడుముక్తుడే..."

దాంతో అన్నయ్య పేట్రేగిపోయి ఘాటుగా మాట్లాడటమూ, మామయ్యకూడా మరింత ఘాటుగా జవాబు చెప్పటమూ జరిగింది. వాళ్ళిద్దరూ అలా పోట్లాడుకుంటుంటే నాన్న కలిగించుకుని యిద్దర్నీ కేకలేశాడు. మామయ్యతో, "పోనీ నువ్వు కాస్త మెల్లగా చదవకూడదట్రా? ఇక్కడ వినేవాళ్ళెవరూ లేరుగా?" అన్నాడు. ఆ ఒక్క మాటతో మామయ్యకు కోపం వచ్చి, కొడుకు పక్షం చేరి మాట్లాడుతున్నాడని నాన్నమీద అలిగి ఆ రాత్రికి రాత్రే పొలాలమ్మట నడిచి వాళ్ళ వూరెళ్ళిపోయాడు. ఆ మర్నాడు యింట్లో అమ్మా, అక్కయ్యా వాళ్ళంతా మామయ్య అలా అలిగిపోయినందుకు బాధపడుతోంటే నాన్న అన్నాడు: "వాడికి వేపకాయంత వెర్రి వుంది. అది వదిలిపోయాక వాడే వస్తాడు. రాకపోతే అప్పుడు చూద్దాం..." ఆయన అన్నట్టే

మూడోనాటికల్లా మళ్ళీ తయారు శేషుమామయ్య, పూలూ, కూర గాయలూ తీసుకుని.

ఇది జరిగి దాదాపు పదిహేనేళ్ళు ఐంది. చెప్పవచ్చిం దేమిటంటే అప్ప టికే పరమ భాగవతోత్తముడుగా, మహా పౌరాణికుడుగా మామయ్య కీర్తి చుట్టుపట్ల గ్రామాల్లో వ్యాపిం చింది. ఆయా గ్రామాల్లోంచి తరచుగా ఒకచోట పురాణం చెప్పటానికనీ, మరోచోట తిరునాళ్ళప్పుడు దేవాల యాల్లో పూజా పునస్కారాలు చేయిం చటానికనీ మామయ్యకు పిలుపులు వచ్చేవి. వెళ్ళినచోటల్లా మంచి సంభా వనలు గిట్టేవి.

ఆ తరువాత నాలుగైదేళ్ళు గడి చాక నేను కాలేజీ చదువులకు బస్తీకి వెళ్ళాను. ప్రతిసారీ సెలవుల్లో యింటికి వచ్చేవాణ్ని. నేను వచ్చినప్పుడల్లా నన్ను చూడటానికి వచ్చి రెండుపూట లుండి వెళ్ళేవాడు మామయ్య. కాని బి. ఏ. ఫైనలియర్ చదువుతున్నప్పుడు మాత్రం పబ్లిక్ పరీక్షల గొడవలో పడి వుండటంవల్ల నేను దసరా సెలవు ల్లోనూ, సంక్రాంతి సెలవుల్లోనూ యింటికి రావటం పడలేదు. అంటే, వేసవి సెలవుల అనంతరం కాలేజీలు తీసినప్పుడు బస్తీకి వెళ్ళినవాణ్ని తిరిగి సంవత్సరానికి పరీక్షలు రాసి వేసవి సెలవుల్లో యింటికి వచ్చాను. వచ్చే సరికి మామయ్య జీవితం ఓ కొత్త మలుపు తిరిగింది.

ప్రతీసారీ నేను యింటికి వచ్చానని తెలియగానే మర్నాడే నన్ను చూడ టానికి వచ్చే మామయ్య అప్పుడు వారం రోజుల తర్వాత వచ్చాడు; అదీ నేను కబురు చేశాక. పొద్దున్నే వచ్చి ఆ సాయంత్రమే తిరిగి ప్రయా ణం కట్టాడు, ఏవో అర్జంటు పను లున్నాయని. ఆ రాత్రికి నిలవమని ఆయన్ని బలవంతం చేస్తున్న నన్ను పక్కకు పిలిచి అన్నయ్య అన్నాడు:

"నువ్వు లక్ష రూపాయ లిచ్చినా ఆయన ఆగడురా అబ్బాయ్! అక్కడ వూళ్ళో అయస్కాంతం లాగు తుంటుంది."

"ఎవ రా అయస్కాంతం?"


"నాగరత్నమ్మ.''

మామయ్యవెళ్ళిపోయాకఅన్నయ్య టూకీగా అసలు విషయం చెప్పాడు. మామయ్య తన కుటీరంలో రోజూ పురాణం చెప్పేటప్పుడు విని తరించ టానికి వచ్చే భక్తబృందంలో ఒక నాగరత్నమ్మ వుంది. ఆవిడ పెళ్ళయి నాక కొద్దిరోజులకే కొన్ని అనివార్య కారణాలవల్ల భర్తను వదిలిపెట్టివచ్చి మామయ్య వుండేవూళ్ళో తన పుట్టింట వుంటోంది. నాగరత్నమ్మ పురాణం వినటానికి రావటం మొదలుపెట్టి నప్పట్నుంచీ మామయ్యలో పొడసూ

పిన మార్పు నే నింతకుముందే గమనించాను. ఆయన అంతకుముందు ఎక్కువగా చదువుతున్న రంగనాథ రామాయణం, భక్తవిజయం లాంటి వన్నీ పక్కకి తోసేసి, అప్పట్నుంచీ నిత్యమూ వట్టి భాగవతాన్నే చదివే వాడు. ముఖ్యంగా శ్రీకృష్ణులవారి రాసక్రీడల్ని మైమరచి గానం చేస్తూ అందులోని భక్తి శృంగారతత్వాన్ని ఎంతో రసావేశంతో నాగరత్నమ్మకు వివరించేవాడు. ఫలితంగా ఆవిడకూడా ఆ తత్వ మేదో తరచిచూడా లన్న ఆసక్తి కలిగినదై ఇటీవల కొద్ది రోజుల్నుంచీ మామయ్యకు శిష్యరికం చేస్తూ, ఆయనద్వారా చాలా కొత్త విషయాలు నేర్చుకుంటోంది.

నాగరత్నమ్మ నా మనసులో మెదిలింది. బర్మాముడీ, ధగధగా మెరిసే వజ్రాల కమ్మలూ, నుదుటిపై సన్నని పొడవైన కస్తూరి బొట్టూ, చేతిలో ఫలపుష్పాదులతో నిండిన పళ్ళెం... నేను నిరుడు రెండు మూడు సార్లు సెలవుల్లో మామయ్య యింటికి వెళ్ళినప్పుడు పురాణ కాలక్షేపంలో ఆవిణ్ని చూశాను. మామయ్యను ఉత్తేజపరచే అంశ మేదో ఆవిడలో వుందని ఆనాడే అనిపించింది నాకు... భేష్, మామయ్య భక్తితత్వానికి ఆవిడ శృంగారపు మెరుగులు దిద్దుతున్నదన్నమాట! కాని యీ విషయము మా యింట్లో మిగతావాళ్ళందరికీ కలిగించినంత ఆశ్చర్యం నాకు కలిగించలేదు. ఆయన చెప్పే కథలూ, కబుర్లూ ఎన్నో విన్నవాడినవటంవల్ల. ఎప్పుడో ఒకనాడు ఆయనలో నిజయదేవుడో, విప్రనారాయణుడో యిలా హఠాత్తుగా బయటపడకుండా వుండడని నే ననుకుంటూనే వచ్చాను.

క్రమేపీ మామయ్య జీవితంలో ఆ శృంగారమే ప్రధానరసముగా, భక్తి కేవలం అంగంగా పరిణమించింది. లక్ష్యం నెరవేరగానే ఆగిపోయే వుద్యమంలాగా పురాణశ్రవణం మూలబడిపోయింది. విష్ణ్వాలయం పూజ మాత్రం యిక తప్పదన్నట్టు ఏదో తూతూ మంత్రంగా జరుపుతున్నాడు, కైంకర్యపు భూమిల్ని అనుభవిస్తూ వుండటం వల్ల. కాని అంతకుముందే పరమ భాగవతోత్తముడుగా చుట్టుపట్ల గ్రామాల్లో ఆయన సంపాయించిన కీర్తి కేమీ లోటు రాలేదు. ఇప్పటికీ మామయ్య ఆయా గ్రామాలకు పూజలకనీ, పురాణాలకనీ వెళ్ళుతునే వున్నాడు. సంభావనలు తెచ్చుకుంటూనే వున్నాడు. కాని మునుపు వాళ్ళు ఎంత యిస్తే అంత తీసుకునే వాడు యిప్పుడు 'ఇంత' అని అడిగి బేరమాడి మరీ తెచ్చుకుంటున్నాడనీ, అలా వచ్చిందంతా జాగ్రత్త చేసి, దాన్ని నాగరత్నమ్మ వస్త్రాభరణాల




నిమిత్తం విని యోగిస్తున్నాడనీవినికిడి.

మునుపు మామయ్య నాలుగు రోజులకో మారు మా యింటికి వచ్చేవాడు. అది కాక, యింట్లో ఏ చిన్న పండుగ వచ్చినా, శుభకార్యం జరిగినా మామయ్య కనీసం ఒక్క-రోజైనా ముందుగా రావలసిందే. అలా రావటం ఆయన మరిచిపోతే నాన్న కబురు చేసి మరీ రప్పించేవాడు. ఒక్కొక్క సారి అలా వచ్చి రోజుల తరబడి వుండిపోయేవాడు మామయ్య. ఇప్పుడదంతా మారిపోయింది. నాగరత్నమ్మ సాహచర్యంతో గడుపవలసిన అమూల్య క్షణాలను ఇతరత్రా గడపటం అవివేక మనుకున్నాడేమో, ఎప్పుడో కాని మా వూరికి రావటం లేదు. వచ్చినా మళ్ళీ ఆ రోజే ప్రయాణం. ఆ రోజు వుండిపొమ్మని పొరబాటున అన్నామా, "మీ కేం తెలుసు? అక్కడ యింటిదగ్గర కొంపలు మునిగిపోతుంటేను..." అని విసుక్కుంటాడు. పూర్వం ఆయన మా వూరికి వచ్చేటప్పుడు వెంట ఏ రామాయణమో, భగవద్గీతో తెచ్చుకునేవాడు. ఇప్పు డసలు రావడమే అరుదు; వచ్చినా వుండేది కొన్ని గంటలపాటే; ఆ కాసేపట్లోనూ చదివేది ఘాటు ప్రేమ కథలూ, సినిమా పత్రికలూ వగైరా.

మామయ్య మచ్చలేని అఖండ భక్తుడుగా వెలుగొందిన రోజుల్లో అయనకు చుట్టుపట్ల గ్రామాల్లో ఏర్పడ్డ శిష్యబృందంలో ఈశ్వరమ్మ అనే వృద్ధ భక్తురా లొకావిడ వుంది. మంచి గౌరవమైన, సంపన్నమైన కుటుంబం

లోంచి వచ్చిన ఈశ్వరమ్మ మర్యాదా, మన్ననా తెలిసిన మనిషి. వాళ్ళ కుటుంబానికి ఆవిడే పెద్ద. చిరకాలంగా ఆవిడకు మా నాన్నంటేనూ, ఆయన ద్వారా మామయ్యంటేనూ ఎనలేని భక్తి విశ్వాసా లున్నాయి. మామయ్య తరచుగా వాళ్ళ యింటికి కూడా పూజలకనీ, పురాణాలకనీ వెళ్ళివస్తూం డటం కద్దు. మొన్న సంక్రాంతి సెల వుల్లో నేను యింటికి వచ్చినప్పుడు ఆయన ఈశ్వరమ్మ భక్తిని గురించీ, ఆవిడె వాళ్ళ వూళ్ళో కట్టిస్తోన్న **రామమందిరం గురించీ**, ఆ మందిరంలో పూజ ప్రారంభమయ్యే రోజున అక్కడ తన చేతిమీదుగా జరగ వలసిన తతంగం గురించీ చాలాసేపు నాతో ముచ్చటించాడు. సంక్రాంతి సెలవులు పూర్తయి, నేను బస్తీకి వెళ్ళి పోయింతర్వాత ఒకసారి నాకో వుత్త రంకూడా రాశాడు, ఎప్పుడూ ఎవరికీ వుత్తరాలు రాసే అలవాటు లేని మామయ్య. దాన్లో, ఈశ్వరమ్మ కట్టిం చిన మందిరంలో శ్రీరామనవమినాడు పూజ ప్రారంభ మవుతుందనీ, నన్ను రమ్మనీ మరీ మరీ రాశాడు. కాని వెళ్ళటానికి నాకు సెలవు చిక్కింది కాదు.

వెళ్ళకపోయినా ఆ పూజా కార్య క్రమా లెలా జరిగాయో తెలుసుకుం దామని వుంది. కాని ప్రతిసారీ అడ క్కుండానే యిలాంటివన్నీ చెప్పు కొచ్చే మామయ్య, యీమారు ఆ విష యము ఎత్తనేలేదు. అంచేత నేనే ఆ ప్రస్తావన తీసుకొచ్చి—

"ఈశ్వరమ్మ కులాసాగా వుందా?" అన్నాను.

"ఏమో, ఎవరికి తెలుసు?''

"అదేమిటి?"

"ఒరే, దాని వూసెత్తకు నావద్ద."

"మరి భక్తురాలు కదా..."

"భక్తీ దాని పిండాకూడూనూ... అంతా దొంగభక్తి—వృద్ధ నారీ పతి వ్రతా అన్నట్టు...ఇలాంటి వాళ్ళ కంతా భక్తి కుదురుతుందా? అందుకు చిత్తశుద్ధి అవసరం."

నేను ఆశ్చర్యపోయాను. మొన్న సంక్రాంతి సెలవుల్లో ఈశ్వరమ్మను గురించి మాట్లాడినప్పుడు మామయ్య అన్న దిది:

"అసలు ఈశ్వరమ్మ తరహాయే వేరు. ఆమె కున్నటువంటి భక్తీ, దైవ చింతనా, అణకువా, ఆప్యాయతా, యివన్నీ కేవలం పూర్వజన్మ సంస్కార విశేషం చేతనే పట్టుబడ్డాయా అనిపి స్తుంది. ఇంటికి వెడితే నాలుగు భాగ వత పద్యాలైనా చదివి చెప్పందే యివతలికి రానివ్వదుకదా? పండ్లో, ఫలహారమో, పాలో, మజ్జిగో పుచ్చు కోనిదే అక్కడనుంచి కదలనివ్వదు కదా? ఏదో అటువంటి ధర్మాత్ములు



కొందరైనా ప్రపంచకంలో వున్నారు కాబట్టే ఆయొక్క కలిపురుషు డింకా విజృంభించటం లేదుగాని..."

ఈ సదభిప్రాయాన్ని యింతలోనే పాడుచేసుకున్న ఈశ్వరమ్మ మీద ఎంతైనా జాలి వేసింది నాకు' మామయ్యలాంటి భక్త శిఖామణి ఆగ్రహిస్తే ఆవిడకు తరుణోపాయం లభించే దెలాగా అన్న ఆవేదనకూడా కలిగింది. ఆవిడ చేసిన నేరం ఏమిటో

తెలుసుకోవా లనిపించినా, ఆ నేరా లను నోటితో వుచ్చరించటానికి కూడా మా ౼ య్యకు అసహ్యం కాబట్టి, ఏమీ అడక్కుండా వూరుకున్నాను.

ఆ సాయంత్రం మామయ్య వెళ్ళి పోయాక అన్నయ్య నా దగ్గరికి వచ్చి "ఇంతకీ ఏమంటా డాయన? ఈశ్వ రమ్మగారి వూరికి వెడతా నంటాడా ఎప్పుడేనా?" అన్నాడు. నాకూ మామయ్యకూ జరిగిన సంభాషనిణ అన్నయ్య విన్నాడల్లే వుంది.

"ఎలా వెళతాడు? ఆయన కెందుకో మనసు విరిగిపోయినట్టుంది."

"మనసు కాదు, వెళ్ళాడం లే నడుం విరుగుతుంది మనిషికి,'' అన్నాడు అన్నయ్య. అన్నయ్య కేనాడూ మామయ్యపై మంచిఅభిప్రాయం లేదు.

"ఇంతకీ ఏం జరిగింది?" అన్నాను.

అన్నయ్య చెప్పుకొచ్చాడు. "రామ మందిరంలో పూజ ప్రారంభ మవటా నికి పదిరోజులు ముందుగానే భక్తుల కోరికపై మామయ్య వెళ్ళి అక్కడ మాకాం పెట్టాడట. ఆయన చేసే పనల్లా రోజూ పొద్దుటినుంచీ సాయం త్రమువరకూ జపావాదినామం చెరగ కుండా చూచుకుంటూ మందిరంలో కూచోవటం, ఆయా వేళల్లో ఈశ్వ రమ్మగా రింటినుంచి యథాశక్తిగా వచ్చే పండ్లూ, పాలూ, ఫలహారాలూ అరగిస్తూండటం, రాత్రిళ్ళు మంది రంలో కాసేపు పురాణం చెప్పటం; పోతే పగలంతా ఆయన దేవుడివిగ్రహం ఎదుట సుందరకాండ పారాయణ చేస్తున్నాడని అంతా అనుకునేవాళ్లు.

"కాని మామయ్య పారాయణ చేసేది సుందరకాండ కాదు; భాగవ తంలోని శ్రీకృష్ణుని రాసక్రీడా ఘట్టం. అదీ దేవుడి విగ్రహం ఎదుట కాదు; మందిరంలో వూడ్చటం, ముగ్గులు పెట్టటం, పూలు కోయటంలాంటి పనులు చేసే చుక్కమ్మపిల్ల ఎదుట. చుక్కమ్మ ఈశ్వరమ్మగారి పొలాల్లో పనిచేసే ఒక పాలేరు భార్య-కొత్తగా పెళ్ళయింది. చక్కగా వుంటుంది.

"రాసక్రీడా పారాయణం ఆనాడు నాగరత్నమ్మలో కలిగించిన చలనంలో నూరోవంతైనా యిప్పుడు చుక్క మ్మలో కలిగించినట్టు లేదు. అంచేత నాలుగైదు రోజులు గడిచాక సరాసరి కార్యరంగంలోకి దిగదల్చుకున్నాడు మామయ్య. ఆ రోజుపొద్దున మందిరా నికి చుక్కమ్మ పూలు తీసుకువెళ్ళగానే, బుట్టలోంచి యిన్నిపూలు తీసుకుని ఆ పిల్ల కొప్పులో తురిమాడట. చుక్కమ్మ కాస్త ఖంగారుపడినా, ఏదో పెద్ద వాడు చనువుకొద్దీ అలా చేసివుంటాడు లెమ్మని వూరుకుంది.

"ఆ సాయంత్రం చుక్కమ్మ మంది రంలో పనంతా పూర్తి చేసి వెళ్ళబో తుంటే, 'చుక్కా' అని వెనక్కి పిలిచా డట మామయ్య.

"ఈ సంబోధనతో చుక్కమ్మకి కోపం వచ్చింది. మామయ్య దగ్గరకి వెళ్ళి, 'ఏం దయ్యగోరూ ఆ పిలుపు? మావోడొక్కడే నన్నట్టా పిలుత్తాడు. ఆడు పిలిత్తేనే వూరుకుంటాను,' అంది.

"మామయ్య నవ్వాడు."

'ఎందుకు పిలిసేరో చెప్పండి. నేం బోవాల...ఆ ఎదురు జూత్తుంటాడు.'

"మామయ్య మళ్ళీ నవ్వాడు, ద్వంద్వాలకు అతీతుడైన యోగిలాగా.

"ఎప్పుడూ 'ఆణ్ణి' గురించే కలవరమయితే ఎలాగే చుక్కా? మరి నా సంగ తేం జేశావు?" అన్నాడు.

చుక్కమ్మ మండిపడింది.

"మీ సంగతా? అమ్మగోరితో మాట్లాడొచ్చి చెబుతా నుండండి..." అంటూ గిరుక్కున వెళ్ళిపోయింది. ఆ పిల్ల. అక్కణ్నుంచి నేరుగా ఈశ్వరమ్మగారింటిదారిన వెళ్ళటం చూసిన మామయ్య తన కర్తవ్యమేమిటో గుర్తించినవాడై వెంటనే అడ్డదారిన పొలాలమ్మట నడిచి రాత్రికి రాత్రే తన వూరికి వచ్చేశాడట. ఆ హడావుడిలో ఆయన మందిరంలో వదిలిపెట్టివచ్చిన వస్తువుల్లో మదన కామరాజు కథల పుస్తకం ఒకటి ఈశ్వరమ్మకు దొరికిందట.

"మళ్ళీ యీ రోజుదాకా ఆ వూరి చాయలకే వెళ్ళటంలేదట మామయ్య.

"ఇది నీ కెలా తెలిసింది?" అనడిగాను అన్నయ్యను.

"మొన్న ఆ మధ్య నాన్న ఏదో పనిమీద ఈశ్వరమ్మగారింటికి వెడితే ఆమె ఆయనతో యీ కథంతా పూస గుచ్చినట్లు చెప్పిందట."

"మరి నాన్న మామయ్య నేమీ అనలేదా?"

"లేదు. నాలుగూ పెట్టమని నేను చెబితే, అందువల్ల నిష్ఠూరం కొని తెచ్చుకోవటం తప్ప వేరే ఫలితం వుండదన్నాడు నాన్న..."

"మరి మామయ్య ఇప్పుడు ఈశ్వరమ్మ పేరెత్తితేనే మండిపడుతున్నాడెందుకని?"

"ఇన్నాళ్ళూ ఈయన పరమభక్తుడని నమ్మి శుశ్రూష చేసిన పాపానికి, పాపం, ఆవిడేమో ఈయన చేసిన అప్రాచ్యపు పని గురించి ఎవ్వరికీ చెప్పనేలేదట. ఒక్క నాన్నతో తప్ప, కాని మామయ్యకు మాత్రం ఆవిడ యీ విషయం గురించి నలుగురితోనూ చెప్పకుండా వుంటుందా అని అనుమానం. ఆ అనుమానం కసిగా మారి, ఆయన సమయం దొరికినప్పుడల్లా ఆమెను దుయ్యబట్టుతుంటాడు ... అదొక సైకాలజీ," అన్నాడు, బి. ఏ. లో సైకాలజీ మాత్రం ప్యాసై ఆ తర్వాత పరీక్షకి వెళ్ళటం మానేసిన అన్నయ్య.